క్లుప్తంగా

8న టీటీడీ ఆధ్వర్యంలో సౌభాగ్య కార్యక్రమం



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 8వ తేది శ్రావణ శుక్రవారం సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళలకు సౌభాగ్య కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దేవాలయాల పర్యవేక్షణ అధికారి మల్లికార్జునరావు తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం ఆయన బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ 60 అనుబంధ దేవాలయాల్లో శుక్రవారం మంగళాక్షింతలు, మహిళలకు పసుపు కుంకుమ, గాజులు అందజేస్తున్నట్లు తెలిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం ఏడు గంటల నుంచి విశేష అర్చనలు నిర్వహించి శ్రీవారికి సమర్పించిన సౌభాగ్య ద్రవ్యాలను భక్తులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగాం అసిస్టెంట్ సీకే ప్రసాద్, దేవాలయ సిబ్బంది రోహిత్ పాల్గొన్నారు.

జ్ఞానమార్గాన్ని అందించేది భగవద్గీత



విజయవాడ కల్చరల్: జ్ఞానమార్గాన్ని అందించేది భగవద్గీత అని ఆధ్యాత్మికవేత్త భార్గవ శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఆదిశంకర విరచిత శంకరభాష్య భగవద్గీత ప్రవచనాలు ఆధ్మాతిక సాంప్రదాయాన్ని చాటుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో రామచంద్రమూర్తి భగవద్గీతలోని అర్జున విషాదయోగం, సాంఖ్యయోగంలోని విశేషాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ శంకరాచార్యుల భాష్యం అద్వైత వేదాంత సూత్రాలను వివరిస్తుందని చెప్పారు. కర్మ, జ్ఞానం మధ్య సంబంధాన్ని శంకరులు వివరిస్తారన్నారు. కర్మ అనేది జ్ఞానాన్ని పొందడానికి సాధనమని తెలిపారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదిన వేడుకల సందర్భంగా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండూరి చంద్రమౌళి పాల్గొన్నారు.

15 నుంచి శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీకృష్ణ మందిరంలో ఈనెల 15 నుంచి 18వ తేది వరకు శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం 9 గంటలకు గోపూజతో శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 16న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పంచామృత అభిషేకం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆరు గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. భక్తులు శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

డయాగ్నోకాన్ - 2025 పోస్టర్ ఆవిష్కరణ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ల్యాబరేటరీస్ అండ్ రేడియాలజీ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అసోసియేషన్ పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని డయాగ్నోకాన్ - 2025 కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శర్వాణీమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నగరానికి వచ్చిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా అసోసియేషన్ నేతలు పోస్టర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కొక్కిరి శ్రీకిరణ్, పీఎం శర్మ, ప్రమోద్ కుమార్, కేఎస్ఎన్ సతీష్, వెంకటేశ్వరరావు, ఎంఎస్‌వీ ప్రసాద్, డి.సురేష్, మంగళగిరి మెడికల్ ల్యాబరేటరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామన్‌రావు, జాన్ సామ్యూల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా పుత్రదా ఏకాదశి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ శ్రీకోదండ రామాలయంలో మంగళవారం పుత్రదా ఏకాదశిపూజలను వైభవంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు స్వామివారి చిత్రపటం చేతబూని శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేస్తూ నగర సంకీర్త చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనధికారిక పార్కింగ్‌తో అవస్థలు

- ట్రాఫిక్ వలయంలో ఎస్ఎన్‌పురం
- జీఎస్‌రాజు రోడ్డులో రోజుల తరబడి వాహనాల పార్కింగ్
- ఫలించని వన్ వే నిబంధన



ఎస్‌ఆర్‌పీ రోడ్డులో దుకాణాల ముందు అనధికారికంగా పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రతి రోజూ వేలాది మంది రాకపోకలు సాగించే సత్యనారాయణపురం పరిసర ప్రాంత వాసులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మినీ బీసెంట్‌రోడ్డుగా చెప్పుకునే ఎస్ఆర్‌పీ రోడ్డులో పలు ప్రైవేటు, జాతీయ బ్యాంకులు, వస్త్ర దుకాణాలు, ఫుట్‌వేర్, కిరాణ షాపులు వంటి అన్ని రకాల వాణిజ్య సంస్థలు ఉన్నాయి. దీంతో ప్రతిరోజూ కొనుగోలుదారులతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. అయితే ఇక్కడ ఉన్న ఏ ఒక్క షాపు, వాణిజ్య సంస్థలు పార్కింగ్ సదుపాయం కల్పించకపోవడంతో ఎస్ఆర్‌పీ రోడ్డుకు ఇరువైపుల వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది. మరో వైపు హాకర్స్ తోపుడు బండ్లను రోడ్డు మీద పెట్టి వ్యాపారాలు చేసుకోవడంతో సమస్య మరింత జఠిలం అయ్యిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో రాకపోకలు సాగించే సిటీ బస్సులు వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. శివాజీ కేఫ్ వద్ద దుకాణాల ముందు పార్కింగ్ చేసిన వాహనాల కారణంగా బస్సులు మలుపు తిరిగేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఇతర వాహనాలు కూడా భారీ సంఖ్యలో నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్ర వేళల్లో కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిత్యం ట్రాఫిక్ సమస్య

జీఎస్‌రాజు రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డులో రోజుల తరబడి వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సమీపంలోని నివాసితులు తమ కార్లను యథేచ్ఛగా రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తున్న కూడా ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వన్ వే నిబంధన ఉన్నా.. ఫలితం సున్నా

ఎస్ఆర్‌పీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతుండటంతో వాటికి చెక్ పెట్టేందుకు త్రీటౌన్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శారద కళాశాల జంక్షన్ నుంచి ఎస్ఆర్‌పీ రోడ్డుకు వెళ్లే మార్గంతో పాటు ప్రభాస్ కళాశాల నుంచి వచ్చే వాహనాలను శివాలయం రోడ్డుకు వెళ్లే మార్గంలో బారికేట్లు ఏర్పాటు చేసి వన్ వే నిబంధన అమలు చేశారు. అయితే స్థానికులు మాత్రం వన్ వే నిబంధనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో ఉంటున్న నివాసితులు వన్ వే నిబంధనతో తమ ఇళ్లకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక ఇబ్బందులు పడుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు తాత్కాలికంగా ఈ నిబంధన తొలగించారు. సత్యనారాయణపురంలోని పలు రోడ్లలో అనధికారిక పార్కింగ్, హాకర్లను నివారిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎస్ఆర్‌పీ రోడ్డులో సిటీ బస్సులు కూడా రాలేని పరిస్థితి



శివాలయం రోడ్డులో రహదారిపైనే రోజుల తరబడి కార్ల పార్కింగ్

ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు



'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' పోస్టర్‌లు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. స్థానిక 57వ డివిజన్‌లో మంగళవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ఇంటింటికీ వెళ్లి బాండ్స్ రూపంలో రాష్ట్ర ప్రజలకు కూటమి నేతలు ష్యూరిటీ ఇచ్చారని.. మోసాలు, అబద్ధాలు నమ్మించడానికి కూడా బాండ్స్ ఇచ్చిన ఏకైక వ్యక్తి చంద్రబాబేనని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ప్రజల్లో ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న ఏకైక ప్రభుత్వం కూడా ఇదేనని పేర్కొన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. జగన్ కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తానని ప్రజలను నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం జగనన్న ఇచ్చిన పథకాల్లో సగం కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. ఒక్క 57వ డివిజన్‌లోనే ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓటు వేసిన పాపానికి రూ.10 కోట్ల మేర నష్టపోయారని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి.. వారిలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మురళి, ఇసరపు రాజు, ఆదినారాయణ, బాల, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడున్నా పన్ను కట్టాల్సిందే

వీఎల్‌టీ పన్ను బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీస్థలాల పన్ను బకాయిలపై వీఎంసీ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యలయంలోని తన చాంబర్లో మంగళవారం వేకెంట్ ల్యాండ్ టాక్స్ కమిటీ మీటింగ్ జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల పన్ను వసూలు చేయటం కోసం విజయవాడ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగంతో పాటు జిల్లా రెవెన్యూ శాఖ, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయం అవసరమని అన్నారు. ఖాళీ స్థలాల పన్నులు, బకాయిల వసూళ్ల కోసం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారని, ఈ మేరకు వీఎంసీ వేకెంట్ ల్యాండ్ టాక్స్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీకి ఇది మొదటి సమావేశమని, ఖాళీ స్థలాల పన్నుల డిమాండ్ గత ఏడాది రూ.237 కోట్లు ఉంటే వసూలు మాత్రం కేవలం రూ.19 కోట్లు మాత్రమే వస్తోందని తెలిపారు. బకాయిలు ఉన్న ఖాళీ స్థలాల యజమానుల వివరాలు తెలియకపోవటం వల్ల వసూలు చేయలేకపోతున్నారని రెవెన్యూ అధికారులు కమిషనర్‌కు వివరించగా అందుకోసమే ఈ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో వీఎంసీ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం నగర పరిధిలోని ఖాళీ స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్ వివరాలు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకి అందించిన వెంటనే స్థలం విక్రయాల డాక్యుమెంట్ ఆధారంగా, యజమానుల వివరాలు తెలుసుకోవడమే కాకుండా వారు ఆ డాక్యుమెంట్లో సమర్పించిన అడ్రస్ ఆధారంగా వారికి నోటీసులు జారీ చెయ్యాలని సమావేశంలో చర్చించారు. ఖాళీ స్థలాల పన్ను బకాయల జాబితాను సర్కిల్, వార్డ్, సచివాలయం వారీగా విభజించి ప్రతి ఖాళీ స్థలం యజమానిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని, విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోగల ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడున్నా సరే వారికున్న ఖాళీ స్థలాల పన్ను బకాయిలను చెల్లించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ కె.చైతన్య, జిల్లా రిజిస్ట్రార్ పి.వి.వి దుర్గాప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, ఏయూబీ శర్మ, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించవచ్చు

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవై రావు



క్యాన్సర్ స్క్రీనింగ్‌కు శిక్షణ ఇచ్చిన వారితో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవై రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో సైతం స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించవచ్చునని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అలపాటి ఏడుకొండలరావు అన్నారు. అప్పుడు వ్యాధిని నయం చేయడం సులభతరం అవుతుందన్నారు. జిల్లాలోని నాన్ కమ్యూనికల్ డీసీజెస్ సెల్ సభ్యులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ప్రాథమిక, ఏరియా ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, దంత వైద్యులకు క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడంపై వైద్య కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి నాలుగో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో వైద్య కళాశాలకు చెందిన 8 విభాగాలకు చెందిన స్పెషలిస్టులు క్యాన్సర్ స్క్రీనింగ్ విధానాలు, గుర్తింపు మార్గాలు, చికిత్సకు ముందు చర్యలు, రోగులకు మానసికంగా ధైర్యం చెప్పే పద్ధతులు వంటి వాటిపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల వద్ద స్క్రీనింగ్ టెస్టులు ఎలా నిర్వహించాలో తెలియజేశారు. ఒక వేళ వ్యాధి నిర్ధారణ అయితే వారికి బ్రేకింగ్ బ్యాడ్ న్యూస్ పద్ధతి ద్వారా సానుభూతితో ఎలా వివరించాలో తెలియజేశారు. శిక్షణ ఇచ్చిన వారిలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గోవింద్, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవి, మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగంనుంచి డాక్టర్ సుధాకర్, జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ మాధవీనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ శ్రీనగర్‌కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ రైల్వే ట్రైనింగ్ సెంటర్ ఫీడర్ పరిధిలో వైర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి. రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, రైల్వే ట్రైనింగ్ సెంటర్, రైల్వే క్వార్టర్స్ ఏరియా, శ్రీనగర్ కాలనీ జీరో లైన్ నుంచి మూడో రోడ్డు వరకు, జాగర్లమూడివారి వీధి, అడవి శేషగిరిరావు వీధి, మల్లిక్ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఐదు గంటలకు 36వ డివిజన్‌లోని సీతన్నపేట రంగా విగ్రహం వీధిలో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్మార్ట్ మీటర్లు ప్రజల పాలిట శాపం

- మీటర్ల బిగింపు ఆపకుంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదు
- ఎన్నికలలో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ హిల్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



గాంధీహిల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సింగ్‌నగర్‌లోని ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రజల పాలిట శాపంగా మారుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల సర్దుబాటు, విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ గాంధీ హిల్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. కార్యక్రమానికి సంఘీభావం తెలియజేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. అదానీ కంపెనీకి రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టేందుకు పూనుకున్నదని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించాలని ఇంటికి వస్తే ప్రతిఘటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు బిగించటానికి వస్తే వాటిని ధ్వంసం చేయండని నాడు నారా లోకేష్ పిలుపునిచ్చారని, కానీ నేడు అదే వ్యక్తి ప్రభుత్వంలో ఉండి బిగింపు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల సర్దుబాటు విరమించుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసగిస్తోందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను అదానీ ఆఫీస్ నుంచి నియంత్రించే విధంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారన్నారు. డిమాండ్‌ను బట్టి విద్యుత్ చార్జీల పెంపుదలను అప్పటికప్పుడు చేపట్టి ప్రజల నెత్తిన భారాలు వేయటానికి కుట్రలు పన్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలని ప్రజలంతా గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నేత రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బుద్దె రాజా, సీఐటీయూ నాయకుడు ఈవీ నారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మాజీ కార్పొరేటర్లు గాదె ఆదిలక్ష్మి, డీవీ రమణబాబు, ఏఐటీయూసీ నాయకులు తాడి పైడియా, కొట్టు రమణారావు, సింగరాజు సాంబశివరావు, యడ్ల కృష్ణకిషోర్, అప్సర్, రాయన గురునాథం, మహిళా సమైఖ్య నాయకులు పంకజ్ఝాన్సీ లక్ష్మి, చింతాడ లక్ష్మి, సీఐటీయూ నేతలు కె.సూరిబాబు, గాదె వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీల సర్దుబాటు, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ హాజరై ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు, సీపీఎం సిటీ సెంట్రల్ కార్యదర్శి బి.రమణారావు, సీఐటీయూ నగర అధ్యక్షుడు కె.దుర్గారావు, ఐద్వా సిటీ సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీరాణి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకుడు టి.ప్రవీణ్‌కుమార్, డీవైఎఫ్ఐ సిటీ సెంట్రల్ కార్యదర్శి ఎస్.కె. నిజాముద్దీన్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎం.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్‌లోని నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన పిచ్చిమొక్కలను, చెత్తచెదారాన్ని కార్పొరేషన్ అధికారులు తొలగించారు. ఇందిరానాయక్‌నగర్, నందమూరినగర్, భారతమాత మందిరం కాలనీ పరిసర ప్రాంతాల్లోని నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు పెరిగిపోవడంతో వాటిలో నుంచి పాములు, తేళ్లు వంటి విషపురుగులు సంచరిస్తున్నాయి. వీటివల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుపుతూ సాక్షి దినపత్రికలో మంగళవారం వెలువడిన 'ప్రజలపాలిట శాపంగా ఖాళీ స్థలాలు' అనే శీర్షికకు కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించే పనులను చేపట్టారు.

ఆహారంలో తక్కువ ఉప్పు ఆరోగ్యకరం

ప్రత్యామ్నాయాలపై ఐఎంఏలో వర్క్‌షాపు



ఆహారంలో ఉప్పు తగ్గించాలని పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఐ, ఐఎంఏ, ఇతర వైద్య నిపుణులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆహారంలో తక్కువ ఉప్పు తీసుకోవడం ఆరోగ్యకరమని పలు విభాగాలకు చెందిన నిపుణులు వెల్లడించారు. చెన్నైకి చెందిన సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పు తగ్గింపు- తక్కువ ఉప్పు ప్రత్యామ్నాయాలపై మంగళవారం వర్క్‌షాపు జరిగింది. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా(ఏపీఐ-ఏపీ), ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ-ఏపీ), న్యూయార్క్‌కు చెందిన ఎన్‌జీఓ సంస్థ రిసల్వ్ టు సేవ్ లైవ్స్ సహకారంతో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది వైద్య నిపుణులు రక్తనాళాలు, గుండె, మూత్రపిండాలు, ఎముకలు వంటి వాటిపై ఉప్పు ప్రభావాన్ని వివరించారు. ఖర్చుతో కూడుకున్న తక్కువ ఉప్పు ప్రత్యామ్నాయాల పాత్ర, లభ్యత గురించి చర్చించారు. ప్రజలకు అవగాహన కలిగించడం, తక్కువ సోడియం ఉత్పత్తులను సంస్కరించడానికి ఆహార పరిశ్రమల ప్రాముఖ్యత, ఆవశ్యకత, అధిక ఉప్పు పదార్థాలపై పన్ను విధించడంపై ప్రభుత్వ విధానాలు వంటి అంశాలపై చర్చించారు. ఉప్పుకు ఆహార లేబులింగ్ వంటి కొన్ని ముఖ్యమైన అంశాలు వైద్య, పోషకాహార నిపుణులు తక్కువ ఉప్పు వంటకాలను సూచించడం వంటివి చేయాలని అభిప్రాయపడ్డారు. సదస్సులో అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా జిల్లా చైర్మన్ డాక్టర్ సీహెచ్ మనోజ్‌కుమార్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.నందకిషోర్, డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, నెఫ్రాలజిస్టు డాక్టర్ ఎడ్విన్, సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజన్ రవిచంద్రన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం



ప్రెస్‌క్లబ్ వద్ద ప్రదర్శన నిర్వహించిన యూనియన్ నేతలు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం జర్నలిస్ట్స్ డిమాండ్స్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా ఏపీయూడబ్ల్యూజే నగర యూనిట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలియజేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్లను ఈ ప్రభుత్వం పొడిగిస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, మిగిలిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ లక్ష్మీశకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ యూనిట్ ప్రెసిడెంట్ చావా రవి, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ దాసరి నాగరాజు, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, కూన అజయ్ బాబు, ఏపీ స్టేట్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయభాస్కర్, ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యులు రఘురాం, నాగమల్లేశ్వరరావు, సామ్నా విజయవాడ నగర అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి మండలి



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు అని కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. గాంధీనగర్‌లోని ఆశీశ్ స్టూడియోలో మంగళవారం మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభ, సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన వారికి మండలి స్ఫూర్తి పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. గోళ్ళ మాట్లాడుతూ మండలి తెలుగు భాష కోసం చేసిన కృషి వెలకట్టలేనిదని తెలిపారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అధికార భాషా సంఘానికి మండలి పేరు పెట్టిన ప్రభుత్వాన్ని అభినందించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీ, చెట్లపల్లి మారుతీ ప్రసన్న, శింగంశెట్టి చంద్రశేఖర్, వీరభద్రరావు, మీరాకుమార్, కోటా వెంకటేశ్వర రెడ్డి, బోడి ఆంజనేయరాజు, భాస్కర శర్మలకు మండలి స్ఫూర్తి పురస్కారాలను అందజేశారు.